



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ, వన మహోత్సవం, ఎన్ఆర్ఈజీఎస్, పారిశుధ్యం తదితర అంశాలపై ఎంపీడీవో, ఎంపీవో, హౌజింగ్ ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇళ్లు, వాటిలో గ్రౌండింగ్ అయినవి, వివిధ దశల్లో ఉన్న ఇళ్లపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే వెంటనే ప్రారంభించాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వన మహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్‌డీవో శ్రీలత, డీపీవో సురేష్‌మోహన్, పౌర సరఫరాల జిల్లా అధికారి వనజాత, డీఈవో సుశీందర్‌రావు, ఉద్యాన శాఖ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగి నిజాయితీగా పనిచేయాలి

ప్రతి ఉద్యోగి నిజాయితీగా పని చేస్తూ ప్రజలకు పారదర్శంగా సేవలు అదించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో పాల్గొన్ని సెంట్రల్ విజిలెన్స్ ఆర్గనైజేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నవంబరు 2 వరకు కొనసాగుతాయన్నారు. ప్రజలకు సేవలు పొందే హక్కు ఉందని, ఆయా శాఖల అధికారులు సుపరిపాలన అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీశ్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కొత్తూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని రాష్ట్ర శిశు హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, చందన, సరిత, ప్రేమలత అగర్వాల్, వచన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. శిశు హక్కులు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం, అధికారిక రికార్డులు, హాజరు, సదుపాయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో అంగోర్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ ఉదయ, సూపర్‌వైజర్ రేవతి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా టీజీ రెడ్కో మేనేజర్ వేణుగోపాల్

నందిగామలో సోలార్ పైలెట్ ప్రాజెక్టు

» ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించిన అధికారులు

నందిగామ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన నందిగామ గ్రామాన్ని మంగళవారం రంగారెడ్డి జిల్లా టీజీ రెడ్కో మేనేజర్ వేణుగోపాల్ స్థానిక ఎంపీడీవో, ఇతర అధికారులతో కలసి ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. సోలార్ పలకలు ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన ప్రభుత్వ పాఠశాలలు, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ప్రాజెక్టులో పైలట్ ప్రాజెక్టులో భాగంగా నందిగామకు రూ.కోటి మంజూరు కావడంతో పనులు ప్రారంభించేందుకు అధికారులు కార్యచరణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమతి, ఎంపీవో తేజ్‌సింగ్, కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బాబోయ్.. కుక్కలు

» భయాందోళనలో ప్రజలు
» తరచూ దాడులు
» పట్టించుకోని అధికారులు

8

కోస్తా తీరాన్ని దాటిన మొంథా తుపాను ఉమ్మడి జిల్లా రైతాంగానికి దడ పుట్టిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రైతుల పాలిట ఈ తుపాను శాపంగా మారింది. పంటలు చేతికందే సమయంలో ఈ ఉపద్రవం ముంచుకు రావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పత్తి, మొక్కజొన్న పంటల దిగుబడి తగ్గుతుందని అధికారులు అంచనా వేయగా.. ఈ తుపాన్ ఎఫెక్ట్‌తో మరింత తగ్గే అవకాశం ఉంది. దీనికితోడు వర్షానికి పత్తి నాణ్యత తగ్గడంతో పాటు మొక్కజొన్నలు మొలకెత్తే అవకాశం ఉంది. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతులు మరింత దిగాలు చెందుతున్నారు.



చేవెళ్ల మండలంలోని ఇబ్రహీంపల్లిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

మొంథా దడ!

పంట చేతికందే సమయంలో తుపాను అలజడి

- ఉమ్మడి జిల్లాలో కోత దశలో పంటలు
- ఇటీవల కురిసిన వానలకే భారీ నష్టం
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతుల ఆందోళన
- పత్తి, మక్క, వరి రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- అధ్వానంగా ఉద్యాన పంటలు
- మరో రెండు రోజులు వర్ష సూచన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఈసారి అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలంలో 2,44,390 ఎకరాల్లో పత్తి సాగు చేయాలని లక్ష్యం నిర్ణయించగా 2,54,605ఎకరాల్లో అంటే 104 శాతం మేర రైతులు పంట వేశారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో 1,62,771 ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా 1,38,780 ఎకరాల్లో సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. అనేక చోట్ల పత్తి నలుపు రంగులోకి మారడంతో దిగుబడితో పాటు పత్తి నాణ్యత కూడా తీవ్ర ప్రభావం పడింది. గతంలో

మిగతా 7వ పేజీలో...



పరిగిలో తడిసి ముద్దయిన పత్తి

ఉద్యాన పంటలకూ నష్టం

ఈ ఏడాది వానాకాలంలో ఉద్యాన పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. భారీ వర్షాల కారణంగా ఉద్యాన పంటల సాగు గణనీయంగా తగ్గింది. రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది వానాకాలం 52,844 ఎకరాల్లో ఉద్యాన పంటలు వేయాలని లక్ష్యం ఉండగా.. కేవలం 11 వేల ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా ఈ సీజన్‌లో వేసిన కూరగాయ, ఆకుకూరలతో పాటు పూల తోటలూ దెబ్బతిన్నాయి. ఇప్పటికే సాగు తగ్గి ఉన్న పంటలు చేతికందక సతమతమవుతున్న ఉద్యాన పంటల రైతులకు మొంథా తుపాను మరింత భయపెడుతోంది.



పంట ఆగమైంది

అధిక వర్షాలతో పత్తి పంట ఆగమైంది. పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి లేదు. ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశా. పత్తితీత సమయంలో వర్షాలు నిండా ముంచాయి. ఇటు కూలీలు దొరక్క, అటు వాన వదలక చేను మీదే పత్తి పూర్తిగా నల్లబారింది. వర్షాలతో పత్తి రాలిపడుతోంది. నల్లబాడిన పత్తికి ధర వచ్చే అవకాశం లేదు.

- నేనావత్ తావుర్యానాయక్, రైతు, మేడిగడ్డ తండా, ఆమనగల్లు

వీసా గడువు ముగిసినా హైదరాబాద్‌లోనే..

» ఉగాండా దేశానికి చెందిన తల్లీకూతుళ్లు
» స్వదేశానికి పంపిన తెలంగాణ పోలీసులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసినా హైదరాబాద్‌లోనే ఉంటున్న ఉగాండా దేశానికి చెందిన తల్లీకూతుళ్లను మంగళవారం తెలంగాణ పోలీసులు వారి స్వదేశానికి పంపారు. వివరాల్లోకి వెళ్తే.. ఉగాండా దేశానికి చెందిన అంగేళ్ల నైరుస్తి(36) కూతురు బ్లెసింగ్ ఓలాబీ ఇద్దరు కొంత కాలం క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. అయితే వారి వీసా గడువు ముగిసినా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టులో మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో తల్లీకూతురుపై కేసు నమోదైంది. వీసా పరిశీలించిన తెలంగాణ పోలీసులు మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎయిర్ అరేబియా జీ9 468 విమానంలో షార్జా వయా కనెక్టింగ్ ఫ్లైట్ జీ9 691 షార్జా నుంచి ఉగాండాలోని ఎంటెబీ విమానాశ్రయానికి తరలించారు.

యాచారంలో డ్రంకెన్ డ్రైవ్

175 మందిపై కేసులు

యాచారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు నిత్యం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు తెలిపారు. మంగళవారం యాచారంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. 175 మందిపై కేసులు నమోదు చేసి వారిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డ వారికి ఒక్కో వ్యక్తికి రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనం నడిపితే కలిగే నష్టాలపై కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఒకరి తప్పిదంతో ఇతరుల ప్రాణాలు పోతాయని, రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతుందని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వారికి వాహనాలు ఇస్తే తల్లితండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఎయిర్‌లాక్

» పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
» బెంగళూరు హైవేపై రెండు గంటలపాటు నిలిచిన వాహనాలు

శంషాబాద్‌రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ అయిల్ ట్యాంకర్ రోడ్డుపై ఎయిర్ లాక్ కావడంతో దాదాపు పది కిలో మీటర్ల ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాల్మాకుల, తిమ్మాపూర్ సరిహద్దు మధ్యలో ఓ ఆయిల్ ట్యాంకర్ హైదరాబాద్ - బెంగుళూర్ జాతీయ రహదారిపై ఆగింది. దీంతో బెంగుళూర్, ఏపీ, నుంచి వచ్చే వాహనాలతో బెంగుళూర్ హైవే ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ, శంషాబాద్ ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను పక్కాకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు దాదాపు రెండు గంటలకు సమయం పట్టిందని, ట్రాఫిక్‌లో అంబులెన్స్ కూడా ఇరుక్కుందని వాహనాదారులు తెలిపారు. ఎట్టకేలకు ట్రాఫిక్ క్లియర్ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.



పాల్మాకుల వద్ద రోడ్డుపై ఆగిన ట్యాంకర్‌ను క్రేన్‌తో పక్కకు తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు



గోడలే పాఠాలై..

ఆదర్శంగా ముట్పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- తరగతి గదుల్లో పాఠ్యాంశాల చిత్రీకరణ
- విద్యార్థులను ఆకర్షించేలా రంగురంగుల బొమ్మలు
- ఉపాధ్యాయుల కృషితో వంద శాతం హాజరు

కొందుర్గు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాఠం చెప్పే గోడలు.. రంగురంగుల చిత్రాలతో ఆకర్షించే చిత్రాలు.. పిల్లలతో కలిసిపోయే టీచర్లతో కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాల ఎప్పుడూ సందడిగా దర్శనమిస్తుంది. బడికి పోవడానికి మారం చేసే పిల్లలు ఎప్పుడు మొదటి గంట కొడతారా అని ఎదురుచూస్తారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల గోడలపై ఉపాధ్యాయులు రంగురంగుల బొమ్మలతో పాఠ్యాంశాలను పెయింటింగ్ వేయించారు.

తరగతిని బట్టి పెయింటింగ్

ముట్పూరు ప్రాథమిక పాఠశాలలో మొత్తం 65 మంది విద్యార్థులుండగా నలుగురు ఉపాధ్యాయులు విధులు

మిగతా 8వ పేజీలో...

దాతల సహకారం మరువలేనిది



ముట్పూర్ పాఠశాల నుంచి 2012 - 25 మధ్యకాలంలో 230 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక అయ్యారు. దాతల సహకారం రూ.లక్షా 50 వేలతో తరగతి గదుల్లో గోడలపై పెయింటింగ్స్ వేయించాం. ఇది పిల్లలకు చదువుపై ఆసక్తిని పెంపొందిస్తుంది.

- అనురాధ, ముట్పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కందుకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ప్రతి పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నాబార్డ్ సంస్థ రంగారెడ్డి జిల్లా డీడీఎం హరీశ్‌రఘురాం అన్నారు. మంగళవారం మండలంలోని నేదునూరు ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ప్రోత్సాహంతో పాఠశాల ఆవరణంలో పెంచుతున్న పండ్లు, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఔషధ మొక్కలు, కూరగాయాల సాగు, ఇంకుడు గుంత, కంపోస్ట్‌పిట్ వంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం వల్ల విద్యార్థులు విద్యతోపాటు సమాజిక స్పృహ కలిగి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు పుష్పలత, గురురాజారెడ్డి, ఎర్త్ లీడర్లు హనిప్రియ, మధిహ, తరుణి, తేజస్విని, రక్షిత, లత, మాధవి, హాసిని, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ అసిస్టెంట్ డైరక్టర్ అన్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.



నేదునూరు ఆదర్శ పాఠశాలలో మొక్కలను పరిశీలిస్తున్న విష్ణుప్రియ హరీశ్‌రఘురాం



మాట్లాడుతున్న డాక్టర్ జ్యోత్స్నారాణి

నైపుణ్యాభివృద్ధి దిశగా ఇంటర్ విద్య

» ఇంటర్ విద్య జాయింట్ సెక్రటరీ డాక్టర్ జ్యోత్స్నారాణి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులు నైపుణ్యం పెంచుకునేలా విద్యావిధానంలో మార్పులు తీసుకువస్తున్నామని ఇంటర్ విద్య జాయింట్ సెక్రటరీ డాక్టర్ జ్యోత్స్నారాణి అన్నారు. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాతల సహకారంతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే సత్ప్రవర్తనతో చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఇంటర్ విద్యార్థుల కోసం టీ-స్టేమ్ పోర్టల్‌ను అభివృద్ధి చెస్తున్నామని తెలిపారు. ఇంగ్లి‌ష్‌పై పట్టు సాధించడానికి వీలుగా ప్రాక్టికల్స్‌ను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్‌సను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. సాయంత్రం స్టడీ అవర్స్‌లో స్నాక్స్‌ను అందజేస్తామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగడానికి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత అన్నారు. మంగళవారం మండలంలోని దండుమైలారంలో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఐకేపీ ఆధ్వర్యంలో జిల్లాలో పది కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డుతోపాటు దండుమైలారం, మంచాల, మాడ్గుల, యాచారం మండలం చింతపట్ల, నందివనపర్తి, కందుకూరు మండలం కొత్తూరుతోపాటు కడ్తాల, తలకొండపల్లి, చుక్కాపూర్, కేశంపేట్ మండలం వేములనర్వలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ముమ్మరంగా గాలికుంటు నివారణ టీకాలు

డీవీఏహెచ్‌వో మధుసూదన్

కడ్తాల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా పశువైద్య అధికారి మధుసూదన్ అన్నారు. పాడిపశువుల పోషణలో రైతులు తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కడ్తాల మండల కేంద్రంలోని పశువైద్యశాలను మంగళవారం సందర్శించారు. ఆసుపత్రి రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. సేవలపై ఆరా తీశారు. స్థానిక పశువైద్య అధికారి భానునాయక్‌తో సమావేశమై ఎఫ్ఎండీ టీకా కార్యక్రమం, పశువైద్యంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, కొండ్రిగాని బోడు తండాకుచెందిన పలువురు పాడి రైతులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కొండ్రిగానిబోడు తండాలో పశు సంవర్థక శాఖ ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మధు, వెంకటయ్య, మల్లేశ్, రాజేశ్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మధుసూదన్

డిజిటల్ పేమెంట్లకే ప్రజల మొగ్గు

- పల్లెలకు విస్తరించిన స్మార్ట్ చెల్లింపులు
- సూపర్ మార్కెట్ నుంచి టీ కొట్టు వరకు ఆన్‌లైన్ లావాదేవీలే అధికం

చేవెళ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో సైతం డిజిటల్ లావాదేవీలు ఊపందుకున్నాయి. రోజురోజుకూ ఆన్‌లైన్‌లో చెల్లింపులపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. డిజిటల్ ఇండియాగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నగదు రహిత లావాదేవీ విధానం కరోనా తర్వాత నుంచి మరింత జోరందుకుంది. మొదట్లో పట్టణాలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు గ్రామాలకూ విస్తరించాయి. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండి ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, యోనో .. తదితర నగదు లావాదేవీల యాప్‌లుంటే చాలు కరెన్సీతో పనిలేకుండా చెల్లింపులు చేస్తున్నారు. టీ కొట్టులో సింగిల్ టీ నుంచి మాల్స్ వరకూ.. మార్కెట్‌లో కూరగాయలు మొదలుకొని జ్యువెలరీ షాపుల్లో బంగారం కొనుగోళ్ల వరకూ డిజిటల్ పేమెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయి. డిజిటల్ లావాదేవీలతో దుకాణాల్లో చిల్లర కష్టాలు తీరాయి. షాపుల్లో క్యూఆర్ కోడ్లు, మొబైల్/బ్యాంకు అకౌంట్ నంబర్లతో డిజిటల్ పేమెంట్లతో డబ్బు చెల్లిస్తున్నారు.

విస్తరిస్తున్న ఆన్‌లైన్ లావాదేవీలు..

ఏ గ్రామంలో చూసినా చిన్న చిన్న షాపుల్లో సైతం క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ స్కాన్ చేసి డబ్బు చెల్లిస్తున్నారు. చేవెళ్ల డివిజన్ పరిధి చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లోని గ్రామాలు, పట్టణ కేంద్రాల్లో తోపుడు బండ్లు, గంపలపై పండ్లు, సైకిల్‌పై అరటి/జామపండ్లు అమ్మేవారు కూడా డిజిటల్ లావాదేవీలకు మొగ్గు చూపుతున్నారు. తక్కువ సమయంలో సురక్షిత చెల్లింపులు జరుగుతుండడంతో వీటికి ఆదరణ పెరిగింది. కిరాణ షాపులో నిత్యావసర సరుకులు, పెట్రోల్, మొబైల్/ కేబుల్ రీచార్జిలకు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, క్రెడిట్ కార్డు బిల్లులు ఇలా అన్నింటికీ ఆన్‌లైన్ పేమెంట్లే చేస్తున్నారు.వారాంతపు సంతల్లోనూ ఆన్‌లైన్ పేమెంట్లు ఎక్కువయ్యాయి. స్మార్ట్ ఫోన్లు వాడరానికి వారు, నిరక్షరాస్తులు మాత్రమే నగదు చెల్లిస్తున్నారు.


కిరాణ షాపులో డిజిటల్ పేమెంట్ చేస్తున్న వ్యక్తి

చిల్లర సమస్య తీరింది



డిజిటల్ లావాదేవీలతో చిల్లర కష్టాలు తీరాయి. అలాగే దొంగనోట్ల బెడదా తప్పింది. గతంలో రూ.5, రూ.10 గిరాకీకి వంద నోటు ఇస్తే చిల్లర ఇచ్చేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఆన్‌లైన్ చెల్లింపులతో ఈ చిల్లర సమస్యకు పరిష్కారం లభించింది. ఈ డిజిటల్ పేమెంట్ విధానం ప్రజలకు, మాకు బాగుంది.

- వై.యాదగిరి,జిరాక్స్ సెంటర్, చేవెళ్ల

చెల్లింపులు సులభతరం



డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత చెల్లింపులు సులభతరం అయ్యాయి. మాకు చిల్లర చౌకబేరాల బెడద తప్పింది. నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. వినియోగదారుడికి మాకు ఈ విధానం సౌకర్యంగా ఉంది. అనసర ఖర్చులు తగ్గాయి. క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేయడం తేలికైంది.

- కుంచం శ్రీనివాస్‌గుప్తా, కిరాణ షాపు యజమాని, చేవెళ్ల

జాగ్రత్తలు తప్పనిసరి..



డిజిటల్ చెల్లింపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి. సైబర్ నేరాల పట్ల చైతన్యవంతం కావాలి. యూపీఐ చెల్లింపు సమయంలో సీక్రెట్ కోడ్ ఇతరుకు ఇవ్వొద్దు. తెలియని వ్యక్తులు, బ్యాంక్ సిబ్బంది పేరిట ఫోన్ కాల్స్ వస్తే స్పందించొద్దు. ఒకవేళ స్పందించినా ఓటీపీ నంబర్లు చెప్పొద్దు. డిజిటల్ పేమెంట్లలో జాగ్రత్తలు తీసుకోవాలి.

- భూపాల్ శ్రీధర్, సీఐ, చేవెళ్ల

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


ఎంపీ రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణలను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. కాంగ్రెస్ పాలనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మంగళవారం నేతలను హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి వారు వెళ్లారు. బోరబండ ప్రాంతంలో ఎంపీ ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో పేదలకు ప్రభుత్వ పథకాలు అందించినందునే ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యశస్వినిరెడ్డి, మందుల సామేలు, నాయకులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, హన్మానాయక్, భాస్కర్‌రెడ్డి, మండ్లీ రాములు, గుర్రం కేశవులు, కాసు శ్రీనివాస్‌రెడ్డి, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణనాయక్, మానయ్య, జగన్, కాలె మల్లయ్య, జవహర్‌లాల్‌నాయక్, తులసీరామ్‌నాయక్, కాకి కృష్ణ, రమేశ్ యాదవ్, చేగూరి వెంకటేశ్, రమేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

రూ.20వేల జరిమానా ● ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడి

పెద్దేముల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ కేసులో ఇద్దరికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా ఖరారైందని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని అప్పటి విజయా బ్యాంకులో 10-03-2016న గోడాల అలివేలు, గణేష్‌రెడ్డిలు నకిలీ నోట్లను డిపాజిట్ చేయడానికి వచ్చారు. వాటిని పరిశీలించిన బ్యాంకు మేనేజర్ వాటిని నకిలీ నోట్లుగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎ-1గా అలివేలు, ఎ-2గా గణేష్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి విచారణ చేశారు. విచారణ అనంతరం వికారాబాద్ ప్రిన్సిపల్ అండ్ జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఇద్దరు నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారని ఎస్పీ వివరించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నకిలీ కరెన్సీ తయారీ, చలామణి వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ చెప్పారు. ఈ కేసు విచారణలో కీలకపాత్ర పోషించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సుధాకర్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ వై.నగేష్, కోర్టు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

బంట్వారం,అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు శిక్ష విధించిందని బంట్వారం ఎస్ఐ విమల మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. బంట్వారానికి చెందిన పాలేపల్లి సముద్దీన్ గత నెలలో మద్యం తాగి వాహనం నడపగా పోలీసులు పట్టుకొని అతడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. మంగళవారం కేసు విచారణ జరిపిన వికారాబాద్‌కోర్టు సముద్దీన్‌కు రూ.4వేల జరిమానా, రెండు రోజుల జైలుశిక్ష విధించినట్టు ఎస్సై తెలిపారు.

ఎయిర్‌పోర్టులో బ్యాగు కలకలం


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అనుమానాస్పదంగా కన్పించిన బ్యాగు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అనుమానాస్పదంగా బూడిద రంగ బ్యాగు లభ్యమైంది. జీఎంఆర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 11.15 గంటలకు అరైవల్ పిల్లర్ నం.10 వద్ద బ్యాగు ఉందని సమాచారంతో భద్రతా బలగాలు బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ చేశారు. బ్యాగులో మొబైల్ ఫోన్లు, నిషేధిత సిగరెట్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని అధికారులు లాస్‌ఫౌండ్ కౌంటర్‌లో ఇచ్చారు. అయితే ఆ బ్యాగును ఎవరు వదిలి వెళ్లారు, ఎక్కడి నుంచి తెచ్చారు, ఎందుకు వదలేశారు? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిషేధిత సిగెరెట్ల విలువ దాదాపు రూ.12.72లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఇప్పటివరకు బ్యాగు మిస్సైందని ఎవరూ ఫిర్యాదు చేయలేదు. నిషేధిత సిగరెట్లు ఉండడం వల్లే ఆ బ్యాగు అక్కడ వదిలి వెళ్లి ఉంటారని అనుమానిస్తున్నారు.

ఇండిగో విమానాన్ని ఢీకొన్న పక్షి?

శంషాబాద్ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వడోదర నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఈ2179 విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంగళవారం రాత్రి 7గంటలకు ల్యాండైంది. అయితే విమానం ల్యాండయ్యే సమయంలో పక్షి ఢీకొన్నట్లు ఎయిర్‌పోర్టు ప్రిడెక్టివ్ ఆపరేషన్ సెంటర్(ఏపీవోసీ), ఎయిర్‌పోర్టు ఆపరేషన్ కంట్రోల్ టీం(ఏపీసీటీ)కు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఏపీసీటీ అధికారులు రన్‌వేపై పరిశీలించగా పక్షి ఆనవాళ్లు లేవని నిర్ధారించారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాన్ని కూడా పరిశీలించారు. అయితే ఎక్కడా పక్షి ఢీకొన్న అనవాళ్లు కనిపించలేదు. పక్షి ఢీకొంటే ప్రమాదం తీవ్ర స్థాయిలో ఉండేదని అధికారులు చెబుతున్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చేవెళ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో కల్యాణలక్ష్మి, షాదీముబరాక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నేడు(బుధవారం) ఉంటుందని తహసీల్దార్ బి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే యాదయ్య చేతులు మీదుగా 54మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, 20 మందికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఎకరం భూమికి రూ.22లక్షలు

- అదనంగా 121గజాల ప్లాట్ ఇస్తామన్న కలెక్టర్
- రూ.70లక్షలు, ప్లాట్, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలన్న రైతులు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మొండిగౌరెల్లి రైతులు

యాచారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొండిగౌరెల్లిలో 821ఎకరాలను ప్రభుత్వం తీసుకుంటున్నందున ఎకరం భూమికి రూ రూ.22లక్షలు, ఎకరానికి 121గజాల ప్లాట్ చొప్పున ఇస్తామని రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి రైతులకు చెప్పారు. మంగళవారం రైతులు కలెక్టర్ కార్యాలయంలో కలిసి తమ డిమాండ్‌ను వివరించారు. తాము ఇదే భూములు సాగు చేసుకుంటూ బతుకుతున్నామని కలెక్టర్‌కు వివరించారు. తమ జీవనాధారంపోతే బతకుదెరువు కష్టమని కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. తమకు ఎకరానికి రూ.70లక్షలు, 121గజాల ప్లాట్, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని రైతులు కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఈ భూముల్లో బినామీలను తొలగించాలని కోరారు. కాగా రైతుల డిమాండ్లపై కలెక్టర్ ఎలాంటి హామీ ఇవ్వలేదు. దీంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

షాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు పోరాడతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారంతో 17వ రోజుకు చేరింది. దీక్షలో వంశ్‌రాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు. బీసీ నాయకులు మాట్లాడుతూ.. 40ఏండ్లుగా బీసీలకు అన్యాయం చేస్తూ అణగదొక్కుతున్నారని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు న్యాయమైనవని, జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. రిజర్వేషన్లు వచ్చే వరకు రిలే నిరాహార దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో రిజర్వేషన్ సాధన సమితి నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల స్వామి, నర్సింహులు, రాము, చంద్రయ్య, రమేష్, దర్శన్, సురేష్, గౌరీశ్వర్, శివ పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీకి ప్రభుత్వం రూ.18.7కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దినదినాభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్ పరిధిలోని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం తన బాధ్యత అన్నారు. మంజూరైన నిధులను అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, తాగు నీటి సదుపాయం, పార్కుల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో రోడ్ల నిర్మాణానికి రూ.105కోట్లు విడుదలయ్యాయని, త్వరలోనే నిర్మాణం చేపడుతామన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, సీనియర్ నాయకులు రఘునాయక్, బస్వం పాల్గొన్నారు.

దరిద్రంగా తెలంగాణ ప్రభుత్వ తీరు

- ఏం చెప్పినా వినిపించుకోని రాష్ట్ర పాలకులు
- ట్రిపుల్‌ఆర్ నిర్వాసిత రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తా
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భరోసా


ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న నిర్వాసిత రైతులు

వికారాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద రైతులకు నష్టం జరగకుండా ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వికారాబాద్, పూడూరు, నవాబ్‌పేట మండలాల రైతులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు ట్రిపుల్‌ఆర్ నిర్వాసిత రైతులు వినతిపత్రం అందజేసి తమ గోడు విన్నవించుకున్నారు. ట్రిపుల్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్‌లో పేద రైతుల భూములే ఎక్కువ పోతున్నాయని, ఈ అలైన్‌మెంట్ కూడా పద్ధతి ప్రకారం లేదని తెలిపారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌లో మార్పు చేయాలని, లేదంటే రైతులకు మార్కెట్ ధర చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అయితే తెలంగాణ ప్రభుత్వం పనితీరు దరిద్రంగా మారిందని, ఈ సర్కారుకు ఏం చెప్పినా వినదని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి రైతులతో అన్నారు. బాధితులకు తన మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. పాత, కొత్త అలైన్‌మెంట్ల వల్ల ఎవరికెంత లాభమో గుర్తించాలని రైతులకు సూచించారు. రైతుల ఆందోళనలకు తన మద్దతు ఉంటుందని, న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో జనార్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

సందీప్ కుటుంబానికి అండగా ఉంటాం

ఘట్‌కేసర్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ మృతిచెందడం బాధాకరం అని మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్ఎఫ్‌సీనగర్‌లోని సాయిసందీప్ కాలనీలో ఉంటున్న కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కానిస్టేబుల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీపీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అమర వీరులను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. సందీప్ కుటుంబానికి పోలీసుశాఖ అండ ఉంటుందని గుర్తు చేశారు. సందీప్ భార్య, తల్లికి శాలువా కప్పి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్లు బాలస్వామి, గోవిందరెడ్డి, రాజు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న డీసీపీ పద్మజారెడ్డి



కలెక్టరేట్‌కు వచ్చిన టేకులకోడ్ వృద్ధులు, వికలాంగులు

కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారు?

» కన్నీటి పర్యంతమైన టేకులకోడ్ వాసులు

వికారాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్ల అవుతున్నా కొత్త ఫించన్లు మంజూరు చేయడం లేదని కొడంగల్ మండలం టేకులకోడ్‌కు చెందిన పలువురు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు వాపోయారు. తమకు కొత్త ఫించన్లు మంజూరు చేయాలని కలెక్టర్‌తో మొరపెట్టుకునేందుకు వారు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చారు. కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో తాము ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంతో పనిచేసేందుకు శక్తి లేక, కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ పొందేందుకు తమకు అన్ని అర్హతలున్నా.. ప్రభుత్వం మంజూరు చేయడం లేదన్నారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో తమ ఇబ్బందులు, కష్టాలు తీరుతాయని తాము ఆశపడ్డా.. తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం స్పందించి అర్హులైన వారందరికీ కొత్త ఫించన్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కవితకు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

» జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

షాద్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జాగృతి జనం బాట కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆమెకు మంగళవారం షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో జాగృతి ఇన్‌చార్జి కన్వీనర్ సీమల రమేశ్, పలువురు నాయకులు స్వాగతం పలికారు. అనంతరం కవిత విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరు, ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే రాష్ట్ర వ్యాప్తంగా 'జాగృతి జనం బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఏ పార్టీ గెలిచినా ప్రజలకు ఒరిగేదేమీలేదని, అందుకే తమ సంస్థ ఉప ఎన్నికకు దూరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జాగృతిని మరింత బలోపేతం చేస్తామని కవిత తెలిపారు.



నాబార్డు డీడీఎం హరీశ్ రఘురామ్‌కు ఔషధ మొక్కలు అందజేస్తున్న సీజీఆర్ ప్రతినిధులు

పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

» నాబార్డు డీడీఎం హరీశ్‌రఘురామ్

కడ్తాల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకతల గురించి విద్యార్థులు ప్రాథమిక దశనుంచే అవగాహన కలిగి ఉండాలని నాబార్డు డీడీఎం హరీశ్‌రఘురామ్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అసిస్టెంట్ డైరెక్టర్ జేఎస్సార్ అన్నమయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కడ్తాలలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో మంగళవారం వారు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఔషధ మొక్కల తోట, కూరగాయల తోట, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్‌లను పరిశీలించి సీజీఆర్‌ను, టీచర్లు, విద్యార్థులను అభినందించారు. పాఠశాలలో పండించిన సేంద్రియ కూరగాయలను హరీశ్‌రఘురాముకు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ, పాఠశాల నిర్వాహకుల కృషిని డీడీఎం అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో నిర్మల, ఔషధ తోట సలహాదారు రఫియొద్దీన్, హెచ్ఎం జంగయ్య, టీచర్లు, ఎర్త్ లీడర్స్ భాగ్యలక్ష్మి, శష్మంత్, రాఘవేందర్, ముజాయిద్, ప్రసాద్, ఆదిత్య, నవదీప్, యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్, ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్ పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న పాపిశెట్టి రాముశ్వేత దంపతులు

నిస్వార్థ సేవలకు చిరస్థాయి గుర్తింపు

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలకు సమాజంలో చిరస్థాయి గుర్తింపు ఉంటుందని లయన్స్ క్లబ్ గవర్నర్ మహేందర్‌రెడ్డి, మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి, రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దుర్గయ్య అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్యుడిగా సేవలందించి రిటైరవుతున్న చంద్రశేఖర్‌కు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మిత్రులు పాల్గొన్నారు. చంద్రశేఖర్‌రాజేశ్వరి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులు సమాజ సేవ, ప్రజాచైతన్య కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా, కంటి వైద్యుడిగా చంద్రశేఖర్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అంజయ్య, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, లయన్స్‌క్లబ్ రాష్ట్ర ప్రతినిధి వీరబొమ్మ బిక్షపతి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కోశాధికారి బికుమాండ్ల శ్రీనివాస్, జోన్ చైర్మన్ లింగయ్య, రీజియన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, గంప శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ మహేందర్‌రెడ్డి

మొంథా దడ!



చేవెళ్లలో కోసేందుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట

(ఐదో పేజీ తరువాయి)

కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి దిగుబడి 30 శాతానికిపైగా తగ్గిందని ఇటీవల అధికారులు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపారు.

మరింత తగ్గనున్న దిగుబడి

ఉమ్మడి జిల్లాలో పత్తి పంట ఇప్పుడిప్పుడే చేతికి వస్తోంది. వరుసగా వానలు కురుస్తుండడంతో ఇంకా పత్తి తీత పూర్తిస్థాయిలో మొదలు పెట్టలేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున పత్తి దిగుబడి భారీగా తగ్గుతుందని ఎకరాకు సగటు 9.1 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే తుపాను నేపథ్యంలో దిగుబడి ఇంకా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాల కారణంగా నాణ్యత దెబ్బతిని పంటకు గిట్టుబాటు ధర కూడా రావడం గగనమని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే తేమ పేరుతో సీసీఐలలో పంట కొనుగోలుకు కొర్రీలు పెడుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా అభ్యంతరాలు చెబుతున్నా సీసీఐ పట్టించుకోవడం లేదు. అలాగే మొక్కజొన్న కోతలు సైతం ప్రారంభమయ్యాయి. అక్కడక్కడ కోత కోసి పంటను ఎండబెడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విత్తనం తడిస్తే మొలకేత్తే అవకాశం ఉంటుంది. ఆరబెట్టిన పంటను వర్షాల నుంచి కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇక వరి సాగు చేసిన రైతులు కూడా వర్షాలకు భయపడుతున్నారు. ఇప్పటికే అక్కడక్కడ వర్షాలు, గాలులకు పంట నేల వారింది. కాగా, తుఫాన్ కారణంగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరించడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



యాచారం మండలం చౌదర్‌పల్లిలో వర్షాలకు తడిసిన పత్తి

చెట్టుపైనే తడిసి ముద్దయింది



నాకున్న ఏడెకరాల్లో రూ.2.20 లక్షలు ఖర్చు పెట్టి పతి సాగు చేస్తున్నా. వరుసగా కురుస్తున్న వర్షాలతో సగం పంట దబ్బతిన్నది. పత్తి తీద్దామనుకున్న సమయంలోనే రాత్రి కురిసిన వర్షానికి తడిసి ముద్దయ్యింది. గతంలో ఎకరాకు 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం మూడు క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశం లేదు. వర్షాలతో పూర్తిగా నష్టపోయాను. ఇలాగే ఇలాగే వర్షాలు పడితే క్వింటా పత్తి కూడా చేతికి రాదు.

- బంగారు రాములు, పత్తి రైతు, తుమ్మలపల్లి, చౌదరిగూడ

పంట చేతికి అందడం కష్టం



ఎనిమిది ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాను. ఇటీవల కురిసిన వర్షానికి దాదాపు సగం పంటకు నష్టం వచ్చింది. ఇప్పుడిప్పుడే పంట కోత దశకు వస్తున్న తరుణంలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పత్తి ముద్దగా మారి పత్తి తీయడం కష్టంగా మారింది. సుమారు రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టినా లాభం లేకుండా పోతోంది.

- చిన్నారెడ్డి, పత్తిరైతు, టేకులపల్లి, కొందుర్గు

31 నుంచి అనంత పద్మనాభుడి పెద్ద జాతర

15 రోజులు కొనసాగనున్న కార్తీక ఉత్సవాలు

నవంబరు 5న రథోత్సవం.. జాతరకు ముస్తాబైన ఆలయం

వికారాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన అనంతగిరి అనంతపద్మనాభ స్వామి ఆలయం కార్తీక మాస పెద్ద జాతరకు ముస్తాబైంది. ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే జాతర 15 రోజుల పాటు కనులపండుగగా జరగనుంది. ఉత్సవాలకు సమీప ప్రాంతాల నుంచే కాకుండా హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు తరలొచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. జాతరకు సంబంధించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుత్ లైట్లతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు.

ధ్వజారోహణంతో ఉత్సవాల ప్రారంభం

31న సాయంత్రం ఉత్సవాలను ధ్వజారోహనంతో అర్చకులు ప్రారంభిస్తారు. వచ్చే నెల 2న కార్తీక ఏకాదశి ఉత్సవం, 3న రాత్రి తులసి వివాహం నిర్వహిస్తారు. 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కల్యాణం, రథోత్సవాలను నిర్వహిస్తారు. 14న ఉదయం 11గంటలకు ఆలయ పుష్కరిణిలో చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయన అధికారులు, అర్చకులు వివరించారు.



అనంతపద్మనాభ స్వామి ఆలయం

చారిత్రక ఆలయం ...

అనంతపద్మనాభ స్వామి ఆలయం ద్వాపరయుగం నాటిదని, ఐదు వేల సంవత్సరాల చరిత్ర కలదని స్థల పురాణం చెబుతోంది. స్వామి దర్శనం కోసం మార్కేండేయ మహర్షి తపస్సు చేశాడని, దానికి మెచ్చి భగవంతుడు శ్రీకృష్ణుని అవతారంలో మహర్షికి దర్శనమిచ్చాడని ప్రతీతి. అనంత పద్మనాభుడిగా సాలగ్రామ శిలా రూపంలో కూర్చున్నట్లుగా స్కంద పురాణాన్ని బట్టి తెలుస్తోంది. పూర్వం అనంతగిరి నుంచి కాశీ వరకు గుహ ఉండేదని, దాని నుంచే మార్కండేయుడు కాశీకి వెళ్లి విశ్వనాథుడిని దర్శించుకొని గంగాజలం తెచ్చి ఇక్కడి స్వామికి అభిషేకం చేసేవాడని అంటారు. కలియుగంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున స్వామి వారిని అర్థిస్తే గంగామాత అనంతగిరి క్షేత్రానికొచ్చి పుష్కరిణిగా మారిందని ప్రశస్తి. ఇందులో స్నానమాచరిస్తే గంగాస్నాన ఫలం దక్కుతుందని పురాణం చెబుతుంది. కార్తీకంలో ఎవరైతే సాలగ్రామ దర్శనం చేసుకుంటే పాప పరిహారం, కోటి కన్యాదాన ఫలం సిద్ధిస్తాయని అర్చకులు పేర్కొన్నారు.



స్వామి వారి పుష్కరిణి

ప్రాభవం కోల్పోయిన పవిత్ర పుష్కరిణి

అనంతగిరి ఆలయ పుష్కరిణిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకుంటే పాపాలు తొలగి, అనారోగ్య సమస్యలు దూరమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గతంలో భక్తులు ఇక్కడ రెండు మూడు రోజులు బసచేసి రోజూ స్వామి వారిని దర్శించుకునే వారు. కాలక్రమేనా అనంతగిరికి పెరిగిన భక్తుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించక భక్తులు ఉదయమొచ్చి సాయంత్రం వరకు ఉండి దర్శనం చేసుకుని వెళ్లిపోతున్నారు. అయితే కొన్ని కారణాలతో పుష్కరిణిని మూసేశారు. పుష్కరిణి నీటిని ట్యాంకులోకి ఎక్కించి ఆ నీటితో నల్లాలు, షవర్ల ద్వారా భక్తులు కాళ్లు, చేతులు కడుక్కునేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికైనా అధికారులు పవిత్ర పుష్కరిణిని వినియోగంలోకి తేవాలని భక్తులు కోరుతున్నారు. కాగా పుష్కరిణిలో కొందరు చేపల పెంపకాన్ని చేపట్టడం వల్లే ఇలా జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

» యువకుడి వేధింపుల వల్లేనని కుటుంబ సభ్యుల ఆరోపణ

» పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన



నందిని(ఫైల్)

మంచాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి ఆరుట్లలో జరిగింది. అయితే యువకుడి వేధింపుల వల్లే యువతి ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబసభ్యులు మంగళవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఆరుట్లకు చెందిన పంబాల నందిని(18) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మేస్త్రీ పని ముగించుకుని ఇంటికి వచ్చిన నందిని తండ్రి దుర్గేశ్ ఇంట్లోకి వెళ్లిచూడగా కూతురు చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోవంతో విలపించాడు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నందిని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ యువకుడి వేధింపుల వల్లే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని నందిని తల్లిదండ్రులు ఆరోపించారు. అనుమానితుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో పోలీస్‌స్టేషన్ వద్ద బంధువులతో కలిసి ధర్నా చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోస్టుమార్టానికి అంగీకరించం అని స్పష్టం చేశారు. ఈ ఆందోళన రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. పోలీసు అధికారులు వారికి నచ్చజెబుతున్నారు.



జుంటివాగు ఉధృతికి కొట్టుకుపోయిన తాగునీటి పైప్‌లైన్

మళ్లీ మొదటికి ...

» జుంటివాగు వరదకు కొట్టుకుపోయిన పైప్‌లైన్

» 47 గ్రామాలకు నిలిచిన మిషన్ భగీరథ నీరు

» నాలుగు రోజులుగా నీటి సరఫరా బంద్

» తరచూ సమస్య పునరావృతం.. పట్టించుకోని అధికారులు

బషీరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటి సరఫరాలో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. నెలల పాటు సమస్య ఉత్పన్నం అవుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడంలేదు. జుంటువాగు వద్ద భగీరథ మెయిన్ లైన్ పైపులు కొట్టుకుపోయి చాలా గ్రామాలకు నీటి సరఫరా నిలుస్తోంది. సమస్య వొచ్చినప్పుడల్లా తాత్కలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఇప్పుడు వరద ఉధృతికి పైపులు కొట్టుకుపోయి సమస్య మళ్లీ మొదటికొచ్చింది. 47 గ్రామాల ప్రజలు నాలుగు రోజులుగా నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ నెల 5న కురిసిన వర్షానికి బషీరాబాద్-తాండూరు రోడ్డులో జుంటువాగు వద్ద వరద ఉధృతికి నీటి సరఫరా మెయిన్‌లైన్ పైపులు కొట్టుకుపోయాయి. 15రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఈ నెల 21న కాంట్రాక్టర్‌తో కొత్తగా పైపులు వేయించి సమస్యను తాత్కలికంగా పరిష్కరించారు. మళ్లీ కురిసిన వర్షంతో పైపులు కొట్టుకుపోయాయి. నీటి సరఫరా పైపుల ఏర్పాటుకు నిధులు మంజూరు కాక, అధికారులు పైపులు వేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నా సమస్య పునరావృతమైతోంది. నాలుగు రోజులు గడుస్తున్నా అధికారులు తాగునీటి సరఫరా విషయమై పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే ఇప్పట్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరించేలా లేరని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ కార్పొరేషన్ అధికారులను అడిగితే స్టీల్ పైపులు ఏర్పాటు చేస్తేనే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని చెబుతున్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని నిధులు విడుల చేయాల్సి ఉంది.

పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ శ్రేణులు నిత్యం ప్రజల్లోకి తీసుకుపోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. విపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విషప్రచారం, కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. కడ్తాల మండలం ముద్విన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన సురేందర్‌రెడ్డికి మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు సురేందర్‌రెడ్డిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. మరేరాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలతో 22 నెలల్లో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, నర్సింహ్మా, సురేందర్ రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి భారత్ పుట్టిల్లు

» కాశీ పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్య

» వెంకమ్మగూడలో మల్లికార్జునాలయ సందర్శన

నందిగామ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మానికి భారతదేశం పుట్టినిల్లు అని, ఎంతో మంది ఋషులు ప్రతిష్ఠించిన ఆలయాలే అందుకు నిదర్శనమని జగద్గురు కాశీ పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్య అన్నారు. నందిగామ మండలం వెంకమ్మగూడలోని మల్లికార్జునభ్రమరాంబ ఆలయం పునర్నిర్మాణం చేయడంతో చంద్రశేఖర శివాచార్య మంగళవారం సందర్శించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. ఆలయంలో చేయాల్సిన పలు పనులను ఆలయ కమిటీకి సూచించారు. శివుడు అభిషేక ప్రియుడని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక దైవచింతనను అలవర్చుకోవాలని స్వామీజి అన్నారు. ఇక్కడ వేల ఏళ్ల క్రితమే శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామి చంద్రశేఖర స్వామికి ఘనస్వాగతం పలికి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.



భ్రమరాంబమల్లికార్జున ఆలయంలో పూజల్లో పాల్గొన్న కాశీ పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్య

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజలు



శామీర్‌పేట పెద్ద చెరువులో ఎంపీ రాజేందర్‌తో కలసి ఛట్ పూజ చేస్తున్న ఉత్తర భారతీయులు

» భారీగా పాల్గొన్న ఉత్తర భారతీయులు

» పూజలకు హాజరైన ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శామీర్‌పేట పెద్ద చెరువులో మంగళవారం ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో సూర్యభగవానునికి ఛట్ పూజలను చేశారు. హైదరాబాద్‌లో ఉండే ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఉదయం పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకొని సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. వారు ప్రతీ కార్తీకంలో పూజలు నిర్వహించడం ఆనవాయితీ. కుటుంబీకులతో కలసి శామీర్‌పేట పెద్దచెరువు వద్దకు వచ్చి భక్తిశ్రద్ధలతో ఛట్ పూజ చేశారు. సోమవారం సాయంత్రం దాదాపు వెయ్యి మంది ఉపవాసంతో సూర్యాస్తమయానికి ముందు చెరువులో స్నానమాచరించి ఛట్‌పూజ చేశారు. అలాగే మంగళవారం సూర్యోదయం సమయంలోనూ శామీర్‌పేట చెరువులో స్నానమాచరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఛట్ పూజల అనంతరం ఉత్తర భారతీయులు భక్తులకు పండ్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అత్వెల్లి పెద్ద చెరువులో...

మేడ్చల్ టౌన్: ఛట్ వేడుకల్లో భాగంగా మంగళవారం మేడ్చల్ మున్సిపల్ అత్వెల్లి పెద్ద చెరువు వద్ద నిర్వహించిన పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. సూర్య నమస్కార పూజతో పాటు గంగకు నైవేద్యం సమర్పించారు. పూజలో పాల్గొన్న ఎంపీని ఉత్తర భారతీయులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు శైలజ, మురళీధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట పెద్ద చెరువులో సూర్యభగవానుడికి మహిళల పూజలు

ఆక్రమణలపై అధికారుల కొరడా

- ఆమనగల్లులో హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్‌పై చర్యలు
- రంగంలోకి దిగిన మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు



ఆక్రమణలను తొలగింపజేస్తున్న మున్సిపల్, పోలీసు అధికారులు

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారికిరువైపులా ఆక్రమణలపై మంగళవారం అధికారులు కొరడా ఝులిపించారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. దుకాణాల ఎదుట, రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసుకున్న డబ్బాలు, కొట్లు, తోపుడుబండ్ల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వివిధ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. డబ్బాలు, తోపుడు బండ్లు, షెడ్లు నిర్మించుకోవడంతో రోడ్డు ఇరుకుగామారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇరుకురోడ్డుపై పలు చోట్ల ప్రమాదాలూ చోటుచేసుకున్నాయి. ప్రధానంగా బస్టాండ్ ఉన్నత పాఠశాల నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ఆక్రమణలు ఇటీవల అధికమయ్యాయి. బస్టాండ్ ఎదుట బస్సులు మల్లడానికి కూడ ఇబ్బందిగా మారింది. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అయినప్పటికీ తొలగించుకోకపోవడంతో పోలీసు, ఎన్‌హెచ్ఏఐ, మున్సిపల్ శాఖలు రంగంలోకి దిగాయి. సీఐ జానకిరామ్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, సిబ్బంది, ప్రత్యేక పోలీసులతో ఆక్రమణలు తొలగించారు.

బాబోయ్.. కుక్కలు

- భయాందోళనలో ప్రజలు
- తరచూ దాడి.. పట్టని అధికారులు



ఎక్లాస్‌ఖాన్‌పేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గుంపుగా సంచరిస్తున్న శునకాలు



వీధుల్లో కుక్కల సంచారం..

కేశంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో దాడికి తెగబడుతాయేమోనని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. కేశంపేట మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్డు వెంబడి వెళ్తున్న వాహనాలపై ఎగబడుతున్నాయి. చికెన్, మటన్ సెంటర్ల వద్ద తిష్టవేసుకుని ఉంటున్నాయి. అలాగే కోళ్ల ఫామ్‌ల వద్ద చనిపోయిన కోళ్లను పారవేస్తుండడంతో అక్కడ గుంపులుగా సంచరిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను కేశంపేట మండల శివారు గ్రామాలైన కొనాయపల్లి, బైర్కాన్‌పల్లి, సంగెం, సంతాపూర్‌లలో వదిలేస్తున్నారు. దాంతో ఆ గ్రామాల్లో కుక్కల సంఖ్య విపరీతమై బైక్‌లపై వెళ్తున్న వ్యక్తులను కరుస్తున్నాయి. రోడ్లపైనే ఉండడంతో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఒంటరిగా వెళ్తున్న చిన్నారులు, మహిళలపై దాడులకు తెగబడుతున్నాయి. జీవాల మందపైనా దాడిచేసి చంపేస్తున్నాయి. దాంతో గొర్రెల, మేకల కాపలకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. ఉదయం సమయంలో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు జంకుతున్నారు. కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఈమేరకు ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. కేశంపేట పశువైద్యాధికారితో ఇప్ప టికే చర్చించాం. వారు కుక్కల జనాభా నియంత్రణ ఆపరేషన్ చేయాలని సూచించారు. త్వరలో తగిన విధంగా చర్యలు తీసుకుంటాం. పనిమీద బయటకు వెళ్లినప్పుడు వీధి కుక్కలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

- రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీడీవో, కేశంపేట

తరచూ దాడులు చేస్తున్నాయి



కుక్కల జనాభా రోజురోజుకూ పెరిగిపోతోంది. గ్రామ పంచాయతీ సిబ్బంది కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలి. మహిళలు, చిన్నారులపై తరచూ దాడి చేస్తున్నాయి. వీధుల్లో మాంసం, చనిపోయిన కోళ్లను పారేయకుండా చర్యలు తీసుకోవాలి.

- కర్రెడ్ల నరేందర్ రెడ్డి, సంతాపూర్

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



మౌనిక (ఫైల్)

కొందుర్గు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మౌనిక (25) కనిపించడం లేదని ఆమె తల్లి ఎరుకలి సువర్ణ మంగళవారం కొందుర్గు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌనికకు ఆరు సంవత్సరాల క్రితం చిలుకమర్రి గ్రామానికి చెందిన యాదయ్య అనే వ్యక్తితో వివాహం జరిగింది. అయితే, ఆరునెలల క్రితం ఆమె భర్త చనిపోవడంతో అప్పటి నుంచి కొందుర్గు మండలం మహాదేవ్‌పూర్‌లోని ఆమె తల్లి సువర్ణ దగ్గరే ఉంటూ కూలి పనులు చేస్తోంది. ఈక్రమంలో సోమవారం కూడా కూలి పనులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటికెళ్లింది. మంగళవారం ఉదయం వరకు తన కూతురు ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

తిరుపతిలో మేకగూడకు చెందిన మహిళ..



భర్త చంద్రశేఖర్‌రెడ్డితో విజయలక్ష్మి(ఫైల్)

నందిగామ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకగూడకు చెందిన చింతలపల్లి చంద్రశేఖర్ రెడ్డి ఆయన భార్య విజయలక్ష్మితో కలిసి ఈనెల 6న బస్సులో తిరుపతికి బయలుదేరి 7వ తేదీ సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. స్వామివారి దర్శనానంతరం 10వ తేదీన తిరుమల నుంచి తిరుపతికి ప్రైవేట్ ట్యాక్సీలో దంపతులు శ్రీనివాస సేతు పిల్లర్ నెంబర్-3 వద్ద దిగారు. చంద్రశేఖర్‌రెడ్డి వాటర్ బాటిల్ కోసం విజయలక్ష్మిని అక్కడే ఉండమని చెప్పి సమీపంలోని షాపుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆమె కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 12న మేకగూడకు చేరుకున్నాడు. విజయలక్ష్మి ఇంటికి రాకపోవడంతో ఈనెల 16న తిరుపతికి వెళ్లి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. విజయలక్ష్మికి మతిస్థిమితం సరిగ్గా ఉండదని గ్రామస్తులు తెలిపారు. తన ఆచూకీ కోసం భర్త తిరుపతిలోనే గత 12 రోజులుగా తిరుగుతున్నాడని గ్రామస్తులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఏబీవీపీ నాయకులు.. పెద్దఎత్తున నిరసన



ఆమనగల్లు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. ఈమేరకు ఆమనగల్లు పట్టణంలో మంగళవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై విద్యార్థినీ విద్యార్థులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బైటాయించి ధర్నా నిర్వహించారు. డీటీ వినోద్ కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. బకాయిలు విడుదల చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కావొస్తున్నా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని ఆరోపించారు. మూడేళ్ల బకాయిలు రూ.8,100 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల కాక ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు విద్యా సంస్థలను మూసి వేసే పరిస్థితి దాపురించిందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా,మండలనాయకులు లండం మల్లేశ్, గోరటి భరత్, కొట్ర సురేశ్, రాకేశ్, మల్లేశ్, అంజి, సురేశ్, సుమన్‌నాయక్, తరుణ్, బద్రు నాయక్, అనిల్, సునిల్, మాస్టర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చేవెళ్ల : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆటలాడుకుంటుందని ఏబీవీపీ శంషాబాద్ భాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. కాగా, పోలీసులు ధర్నా విరమించాలని కోరారు. ఏబీవీపీ నాయకులు చందు, మహిపాల్, వివేకానంద, హరికృష్ణ, ఆకాశ్, వెంకటేశ్, నరేష్, శివ, రాజేశ్వరి, జ్ఞనేశ్వర్, మణిదీప్, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : ఏబీవీపీ నాయకులను ధర్నా విరమింపచేస్తున్న పోలీసులు

కేశంపేట అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందిస్తున్న శివాజీ

కేశంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేశంపేట గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని బీజేపీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధి మల్కాంకర్ శివాజీ ఎంపీ డీకే అరుణకు మంగళవారం వినతిపత్రం అందించారు. మహబూబ్‌నగర్‌లోకి క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసిన శివాజీ కేశంపేట మండల కేంద్రం రోజురోజుకూ అభివృద్ధి చెందుతుందని.. కాలానీలలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం, ముఖ్య కూడళ్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. దశరథ్, శ్రీరాములు, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులున్నారు.

జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

యాచారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రేఖ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో 125 ఆవులకు, 62గేదెలకు టీకాలు వేశామన్నారు. తమ సిబ్బందితో కలిసి ప్రతి గ్రామంలో గాలికుంటు టీకాలు వేస్తున్నామన్నారు.

జాప్యం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అందిస్తున్నట్లు ఎంపీడీవో మాధురి తెలిపారు. సీతారామ్ నగర్‌తండాలో మంగళవారం ఎంపీడీవో పర్యటించారు. అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆమనగల్లు మండలంలో 906 ఇళ్లు పూర్తయ్యాయని, బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశించారు.



వెంకటాపూర్‌లో విద్యా సంబంధిత అంశాలపై సర్వేచేస్తున్న విద్యార్థుల బృందం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.బిర్లా అంజయ్య

వెంకటాపూర్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

మొయినాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలను చైతన్యం చేసేందుకు ఏవీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 బృందం మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్‌లో ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించింది. వారం రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మంగళారం విద్యా సంబంధిత అంశాలపై విద్యార్థులు ఇంటింటికి వెళ్లి నిర్వహించారు. అనంతరం పరిసరాలు, పరిశుభ్రత అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు గ్రామంలో బాలికా విద్య, మహిళా సాధికారిత, ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత, ప్లాస్టిక్‌పై అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమం, పచ్చదనం, పరిశుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టామని ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ డా.బిర్లా అంజయ్య తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆయా అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఏవీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం వెంకటాపూర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేస్తున్న సేవలను వెంకటాపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, గ్రామస్తులు ఈ సందర్భంగా కొనియాడారు.

తహసీల్దార్ జయశ్రీకి సన్మానం



తహసీల్దార్ జయశ్రీ ని సన్మానిస్తున్న బొప్పిడి గోపాల్

కడ్తాల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జయశ్రీని మంగళవారం ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొప్పిడి గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్ కార్యాలయంలో జయశ్రీని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రైతుల భూ సమస్యలు సత్వరంగా పరిష్కరించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. ప్రభుత్వ భూముల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, నాయకులు జంగయ్య, పవన్‌కుమార్, సాయికుమార్, శంకర్, కృష్ణయ్య, భిక్షపతి, తదితరులు ఉన్నారు.

సత్యనారాయణ రావు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే సంతాపం

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతిపట్ల కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావులు సంతాపం ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సత్యనారాయణ రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. హరీశ్ రావు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్థిక సాయం అందజేత

తలకొండపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల దేవకమ్మ, వెంకటమ్మలు అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం మృతుల కుటుంబాలను స్థానిక నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి రూ. 6 వేలు, ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాండు రంగారెడ్డిలు రూ. 10వేలు, మాజీ సర్పంచ్ కిష్టమ్మ రూ2వేల ఆర్థిక సాయం సమకూర్చగా స్థానిక మాజీ ఎంపీటీసీ యాదయ్య అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

తప్పుడు వ్యాజ్యాలతో భూమిపై హక్కు దక్కదు

- హైకోర్టు వ్యాఖ్య
- 1967 నాటి భూ బదిలీపై తీర్పు

హైదరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట ఎప్పుడో బదిలీ అయిన భూమిపై తప్పుడు వ్యాజ్యాల ద్వారా హక్కును పునరుద్ధరించుకోలేరని హైకోర్టు స్పష్టం చేసింది. 1967లో జరిగిన భూమి హక్కుల బదిలీని ప్రస్తావించకుండా 2020లో సివిల్ సూట్ దాఖలు చేయడాన్ని ప్రశ్నించింది. ఓ సివిల్ సూట్‌లో పిటిషనర్లకు అనుకూలంగా ఇబ్రహీంపట్నం కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ 22 సెంచరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ ప్రాజెక్ట్ సంస్థ హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం..లిమిటేషన్ యాక్ట్-1963 నిబంధనలను పట్టించుకోకుండా దిగువ కోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొంది. 1967లో తొలుత భూబదిలీ జరిగిందని, దానిని ప్రస్తావించకుండా పిటిషనర్లు సివిల్ కోర్టును ఆశ్రయించారని తెలిపింది. లిమిటేషన్ యాక్ట్ పరిధి నుంచి తప్పించుకునేందుకు భూబదిలీలను మాత్రమే సవాల్ చేశారని పేర్కొంది. దశాబ్దాల కింద ఎప్పుడో జరిగిన భూబదిలీల్లో కోల్పోయిన హక్కులను బోగస్ లిటిగేషన్ల ద్వారా పునరుద్ధరించుకోలేరని పేర్కొంది. కింది కోర్టు తీర్పును కొట్టివేసింది.

పేదలు 'ఉజ్వల యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మహేశ్

కేశంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పేదలు ఉజ్వల యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు ఉజ్వల యోజన పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తుందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేశ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఉన్న నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తుందని వివరించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులు గ్యాస్ డీలర్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ డీలర్‌తో పాటు షాద్‌నగర్‌లోని హెచ్‌పీ, ఇండియన్ గ్యాస్‌డీలర్లను సంప్రదించాలన్నారు.

'పని ఒత్తిడితోనే సంతకాలు చేయలేదు'

షాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో పనిఒత్తిడితోనే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టలేదని తహసీల్దార్ అన్వర్ అన్నారు. మంగళవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ మధుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 27న ఎమ్మెల్యే యాదయ్య తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారని, ఆ సమయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు హైకోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ మధు కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడడంతో వైద్య పరీక్షల కోసం నగరంలోని అపోలో ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ కోసం వెళ్లారని చెప్పారు. 15 రోజులుగా సిబ్బంది నిషేధిత ఆస్తుల జాబితాను తయారు చేసే పనిలో నిమగ్నమైనట్లు, సిబ్బంది పనిలో ఉన్నందున సంతకాలు చేయలేదని, వేరే కారణాలు లేవని ఆయన తెలిపారు. 15 రోజులుగా పనిలో భాగంగా ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సెలవు దినాల్లో కూడా పని చేస్తున్నామని తహసీల్దార్ అన్వర్ తెలిపారు.

గోడలే పాఠాలై..

(ఐదో పేజీ తరువాయి)



బొమ్మలు చూపిస్తూ పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నిర్వహిస్తున్నారు. బడిలో తరగతిని బట్టి గోడలపై పెయింటింగ్ వేయించారు. ఏ బొమ్మలు ఏ గదిలో వేయించాలని సమష్టిగా నిర్ణయం తీసుకొని గోడలపై ఖాళీ స్థలం కనిపించకుండా అద్భుతంగా చిత్రాలు వేయించి తరగతి గదులను అందంగా తీర్చిదిద్దారు. దీనికి దాతల సహకారం తీసుకున్నారు. హాజరు శాతం పెంపే లక్ష్యంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తీర్చిదిద్దారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు సునీత, మాధవి, దేవేందర్ రెడ్డి పాఠశాలను ఆదర్శంగా నిలిపారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు వీరు తీసుకుంటున్న నిర్ణయాలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామంలో ఇప్పటివరకు ప్రైవేటు పాఠశాల లేకపోవడం మరో విశేషం.

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



ఇక్కడి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనేదే మా సంకల్పం. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి బోధన అందుతుంది.

- సునీత, ఉపాధ్యాయురాలు

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



ఇక్కడి పాఠశాలలో చదివిన మా ఊరి పిల్లలు చాలా మంది గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. అందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయం. తల్లిదండ్రులు సైతం ఈ బడిలో చేర్పిస్తున్నారు. పేద పిల్లలకు ఇక్కడ నాణ్యమైన విద్య అందుతుంది.

- కావలి రాజేందర్, ముట్పూర్

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి



ఆదిభట్ల : బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ రవికుమార్

మహేశ్వరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ వ్యవస్థ నిరంతరం శ్రమిస్తుందని మహేశ్వరం సీఐ హెచ్. వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ జోన్ సీఐ వెంకటేశ్వర్‌రావులు అన్నారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి సైకిల్‌ర్యాలీ, ఆటో డ్రైవర్లతో చైతన్య సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేరాల అదుపునకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. ట్రాఫిక్, సివిల్ పోలీసులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాచారం : పోలీసులు నిరంతరం ప్రజల రక్షణకు పాటు పడుతున్నామని, సంఘ వ్యతిరేకులు మిమల్ని ఇబ్బంది పెడితే నేరుగా డయల్ 100కు సమాచారమందించాలని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని చైతన్య పాఠశాల బాలికలకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. ఎస్సైలు మధు, ప్రియాంక ఉన్నారు.

కాగా, యాచారంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడిన వారి చేత మంగళవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేయించారు. ఇబ్రహీంపట్నం కోర్టు న్యాయాధికారి ఆదేశం మేరకు వారి చేత వాహనాల తనిఖీ డ్యూటీ చేయించారు.

మంచాల : పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంచాలలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం : బైక్ ర్యాలీలో ఏసీపీ రాజు, సిబ్బంది తదితరులు



మహేశ్వరం : తుక్కుగూడలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

2001లో మావోయిస్టుల బాంబుదాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ సాయిలు కుటుంబాన్ని పరామర్శించారు. ఎస్సైలు నాగేశ్వర్‌రావు, వంశీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిభట్ల : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పోలీసు వ్యవస్థ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ రవికుమార్ తెలిపారు. బొంగ్లూర్ ఐడియల్ స్కూల్ విద్యార్థులు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ పోలీసుస్టేషన్‌లో నిర్వహించే 16 రకాలైన విధులు, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా టీసీఎస్ ఉద్యోగులతో కలిసి పోలీసు స్టేషన్ నుంచి ఆదిభట్ల మున్సిపల్ కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి రోడ్డు, ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఉద్యోగులకు సూచించారు. ఎస్సైలు వెంకటేష్, సైదయ్య, సత్యనారాయణ, సిబ్బంది, టీసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత జీవితం లభిస్తుందని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. కడ్తాల మండలం మర్రిపల్లికి చెందిన ఈర్లపల్లి యాదయ్య మహేశ్వరి దంపతుల కూతురు ఈర్లపల్లి శ్రావణి నీట్-2025 ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం శ్రావణిని స్థానిక నాయకులతో కలిసి సత్కరించి అభినందించారు. భాస్కర్, శ్రీను, యాదయ్య, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

నాగుర్లగడ్డ తండా బీటీ రోడ్డుకు నిధులు

- హర్షం వ్యక్తం చేస్తున్న తండావాసులు

కేశంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని నాగుర్లగడ్డ తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులు మంజూరు చేయడం పట్ల కేశంపేట మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్ రెడ్డితో పాటు తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. కేశంపేట పీడబ్ల్యూ రోడ్డు నుంచి తండా వరకు 1.37 కిలోమీటర్ల మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ఎస్‌డీఎఫ్ పథంకలో రూ.కోటి, 47లక్షల నిధులను ఎమ్మెల్యే విడుదల చేయించారని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

మాడ్గుల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అందుగుల, ఇర్విన్ తదితర గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతలకు భంగం కల్గించిన వ్యక్తుల పై కఠినంగా వ్యవహరిస్తామని సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం అందుగుల, ఇర్విన్, గ్రామాలకు చెందిన ఇసుక రవాణా, ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించిన 24 మందిని గుర్తించి తహసీల్దార్ వినయసాగర్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ప్రజలు, చట్టాలను గౌరవించి, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు.